క్లుప్తంగా

బార్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న కమిషనర్ నాగమద్దయ్య

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణానికి ప్రభుత్వం అదనంగా మరో బార్‌ను కేటాయించిందని, ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ శాఖ కమిషనర్ నాగమద్దయ్య సూచించారు. పట్టణంలోని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో ఆదివారం తాడిపత్రి బార్ అసోసియేషన్ సభ్యులతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన వారితో న్యూ బార్ (2025) పాలసీపై చర్చించారు. బార్ ఏర్పాటుకు రూ.55 లక్షలు బార్ ఫీజు, రూ.5 లక్షలు దరఖాస్తు (నాన్ రీఫండబుల్) ఫీజు, రూ.10 వేలు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలన్నారు. ఈ నెల 26 లోపు బార్‌ల ఏర్పాటుకు దరఖాస్తులను అందజేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీపీఈఓ రామమోహన్‌రెడ్డి, సీఐ గడ్డం నాయుడు, అసోషేసన్ సభ్యులు విజయబార్ బాబు, అంబటి రామక్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆయన వారితో న్యూ బార్ (2025) పాలసీపై చర్చించారు.

ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో కనీస సదుపాయాలు కరువు



మాట్లాడుతున్న మోహన్ నాయక్

గుత్తి: గుత్తిలోని ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో కనీస సదుపాయాలు కరువయ్యాయని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు మోహన్ నాయక్ అన్నారు. గుత్తిలోని ఎస్టీ బాలుర హాస్టల్లో విద్యార్థులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. బాత్ రూమ్‌లు, టాయిలెట్లు సరిగా లేవన్నారు. తాగునీరు కూడా లేదన్నారు. విద్యార్థులకు సరిపడినన్ని గదులు కూడా లేవన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

తిరుమల పాదయాత్ర బృందానికి సత్కారం



పాదయాత్ర బృందం సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని పెద్ద విఠోబ దేవాలయంలో ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తిరుమల పాదయాత్ర బృందంతో పాటు సహకరించిన వారిని ఘనంగా సత్కరించారు. గత నెల 17 నుంచి 13 రోజుల పాటు తిరుమల పాదయాత్రలో తమ సంకీర్తనలు ఆలపించిన భావసార క్షత్రియ భజన మండలి సభ్యులు మున్నారావు, మురళీధరరావు, జగదీష్‌రావు, పాదయాత్ర ఆహ్వాన సంఘం సభ్యులు వేణుగోపాలరావు, వడ్డే వెంకటరాముడు, ఆలయ కమిటీ సభ్యులు ముకుంద, శేఖర్, రవి, బొల్లు శ్రీనివాసులురెడ్డి, పాదయాత్ర భోజనదాతలైన మాజీ ఎమ్మెల్యే కొట్రికే మధుసూధన్‌గుప్తా, మీరా బాయి, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, కవి నారాయణమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు జి.రాజశేఖర్‌రావు, ముకుంద, రవి తదితరులను శ్రీవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం అందజేసి సన్మానించారు. వేదపండితులు అనుంపల్లి భాస్కరరావు, పెద్ద విఠోబ ఆలయ కమిటీ, అధ్యక్షుడు కే శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

బుక్కరాయసముద్రం: ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఫర్టిలైజర్ దుకాణదారులను విజిలెన్స్ సూపరింటెండెంట్ ప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని రెడ్డిపల్లి, బీకేఎస్‌లో ఉన్న ఫర్టిలైజర్ షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెడ్డిపల్లిలోని అన్నదాత సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్, ఉమేష్ చంద్ర ఫర్టిలైజర్, బీకేఎస్‌లో ఉన్న మహాలక్ష్మి ఫర్టిలైజర్ షాపుల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాల్లో రికార్డులు సరిగా లేనందున రూ.1,80,790 విలువైన మందుల అమ్మకాలను నిలిపివేశారు. యూరియా అధిక ధరలకు విక్రయించకూడదని సూచించారు. లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ జమాల్ బాషా, సబ్ ఇన్స్‌పెక్టర్ నరేంద్ర భూపతి, విజిలెన్స్ వ్యవసాయ అధికారి వాసు ప్రకాష్, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహాల అనుమతిలో గందరగోళం

- ఒకవైపు పోలీసులు, మరోవైపు కేంద్ర కమిటీ సభ్యులు
- అయోమయంలో నిర్వాహకులు

తాడిపత్రి రూరల్: పట్టణంలో వినాయక విగ్రహాల ఏర్పాటులో గందరగోళం నెలకొంటోంది. విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు తమ వద్ద అనుమతులు తీసుకోపవాలని పోలీసుశాఖ, కేంద్ర కమిటీ సభ్యులు వేర్వేరుగా సూచిస్తున్నారు. ఎవరి వద్ద విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి అనుమతులు, వివరాలను నమోదు చేసుకోవాలో తెలియక నిర్వాహకులు గందరగోళానికి గురవుతున్నారు. వినాయక చవతి పండుగకు కేవలం మూడు రోజుల వ్యవధి మాత్రమే ఉంది. విగ్రహాల కొనుగోలు, మండపాల ఏర్పాటు, విద్యుత్ శాఖ అనుమతులు, మిగిలిన చందాల సేకరణ తదితర వాటిల్లో నిర్వాహకులు బిజీగా ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విగ్రహాల అనుమతిపై స్పష్టత లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే వినాయక ఉత్సవ కేంద్ర కమిటీలో దాదాపు 70 మంది నిర్వాహకులు తమ పేర్లు, వివరాలను నమోదు చేసుకున్నారు. వీరిని నియంత్రించి కేవలం పోలీసుశాఖ వద్ద మాత్రమే పేర్లను నమోదు చేసుకోవాలని చెబితే నిర్వాహకులకు ఉపశమనంగా ఉంటుంది. ఎవరికి వారే అన్న రీతిలో ఉంటే నిర్వాహకులు ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. శాంతి భద్రతల సమస్య తలెత్తినపుడు తమ వద్ద పేర్లను నమోదు చేయించుకోని వారి పరిస్థితి మరో విధంగా ఉంటుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు.



తాడిపత్రిలో విక్రయానికి సిద్ధంగా వినాయక విగ్రహాలు

అధిక సంఖ్యలో విగ్రహాల ఏర్పాటు

తాడిపత్రి రూరల్‌తో పాటు పట్టణంలో గత ఏడాది కంటే అధిక సంఖ్యలో విగ్రహాలను యువకులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన రోడ్లతోపాటు కాలనీలు, వీధుల్లో విగ్రహాల ఏర్పాటు కోసం మండపాల పనులను వేగవంతం చేస్తున్నారు. ఈ ఏడాది దాదాపు 200 విగ్రహాల వరకూ తాడిపత్రి పట్టణంతోపాటు రూరల్ ప్రాంతాల్లో ఏర్పాటు చేయున్నారని పోలీసుశాఖ ప్రాథమిక సమాచారం. మండపాలు, డెకరేషన్, ఇతర కార్యక్రమాల కోసం లక్షలాది రూపాయలను ఖర్చు చేయడానికి కూడా నిర్వాహకులు వెనుకాకడం లేదు. డెకరేషన్ కోసం ఇతర జిల్లాల నుంచి కళాకారులను తెప్పిస్తున్నారు.

పలు ప్రాంతాల్లో విగ్రహాలు..

వినాయక చవితికి కేవలం మూడు రోజులు మాత్రమే ఉండటంతో కొనుగోలు చేసిన విగ్రహాలను పట్టణంలోని నిర్మాణంలో ఉన్న బిల్డింగ్‌లో భద్రపరుస్తున్నారు. తాడిపత్రి పట్టణంతో పాటు గుంతకల్లు, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి విగ్రహాలను కొనుగోలు చేశారు. కొందరు నిర్వాహకులు విగ్రహాల కొలుగోలుకు అడ్వాన్స్‌ల రూపంలో కొంత మొత్తం చెల్లించి తయారీ కేంద్రాల వద్ద ఉంచుతున్నారు. వివిధ ప్రాంతాల్లో తయారైన విగ్రహాలను వ్యాపారులు తాడిపత్రికి తీసుకువచ్చి విక్రయానికి ఉంచుతున్నారు. విగ్రహాల ఎత్తును బట్టి ధర నిర్ణయిస్తున్నారు. కొన్నేళ్లుగా విగ్రహాల విక్రయాలతో లబ్ధి పొందుతున్న వ్యాపారులతో పాటు కొత్త వ్యక్తులు సైతం ఈ వ్యాపారాన్ని మొదలుపెట్టారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు బంగారు భవిష్యత్



మాట్లాడుతున్న ఆలూరు సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల కరెస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో ఈ ఏడాది కొత్తగా చేరిన విద్యార్థినీ విద్యార్థులకు ఆరంభ్–2025 ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాంబశివారెడ్డితోపాటు కళాశాల చీఫ్ అడ్వైజర్ ఈఎస్ చక్రవర్తి హాజరయ్యారు. ముందుగా వారు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సాంబశివారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఇంజినీరింగ్ చదవడానికి మంచి కళాశాలను ఎంచుకోవాలన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నతస్థాయికి చేరుకోవచ్చన్నారు. ఈఎస్ చక్రవర్తి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో తల్లిదండ్రులు కలలను నిజం చేయాలన్నారు. ఈ 17 సంవత్సరాల్లో ఎస్ఆర్ఐటీ కళాశాల న్యాక్, ఎన్‌బీఏ, స్వయంప్రతిపత్తి గుర్తింపు పొందిందన్నారు. టీపీఓ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికీ బంగారు భవిష్యత్ కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తాం



మాట్లాడుతున్న సీఐ ఈరన్న

యాడికి: వినాయక చవితి పర్వదినాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సీఐ ఈరన్న, ఎస్ఐ రమణయ్య సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండపాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయడానికి కమిటీలు తప్పనిసరిగా పోలీసు అనుమతి తీసుకోవాలని సూచించారు. వినాయక విగ్రహాల వద్ద, నిమజ్జనం రోజు, డీజేలు, డ్యాన్స్, ప్రోగ్రామ్ నిర్వహించకూడదన్నారు. ముఖ్యంగా నిమజ్జనానికి వెళ్లే సమయంలో ఎవరూ మద్యం సేవించకూడదని, ఇందుకు నిర్వాహకులు పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసే నిమిత్తం నిర్వాహకులు సహకరించాలన్నారు.

మున్సిపల్ వర్కర్లకు ప్రభుత్వ పథకాలివ్వాలి



మాట్లాడుతున్న వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు

గుంతకల్లుటౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపచేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ 4వ పట్టణ మహాసభ నిర్వహించారు. అయన మాట్లాడుతూ కార్మికులకు ఇళ్ల స్థలాలివ్వాలని, పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, రెగ్యులర్ కార్మికులకు బకాయిపడ్డ సరెండర్ లీవ్, డీఏలు, ఇంక్రిమెంట్లు అమలు చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా నరసయ్య, అధ్యక్షుడిగా శ్యామ్యూల్, కార్యదర్శిగా రంగనాయకులు, కోశాధికారి రవి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శి జగన్, నాగరాజు, కార్మికులు పాల్గొన్నారు.

మృతురాలి ఆచూకీ తెలపండి



మృతురాలు యల్లమ్మ

గుత్తి రూరల్: మండలంలోని రజాపురం శివారున చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందిందని, ఆమె ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ వెంకటేశ్వర్లు కోరారు. వివరాలు.. రజాపురం శివారు ప్రాంతాల్లో భిక్షాటనతో జీవనం సాగిస్తున్న యల్లమ్మను ఈ నెల 2న 67వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొంది. స్థానికులు ఆమెను గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఆమె ఈ నెల 14న ఆస్పత్రిలో మృతి చెందింది. సుమారు 60 ఏళ్ల వయస్సు ఉన్న ఆమె ఊరు, వివరాలు తెలియరాలేదు. కుడి చేతిపై ముగ్గు ఆకారం పచ్చబొట్టు. ఎడమ ఛాతీపై పుట్టుమచ్చ ఉంది. గతంలో కుడి చేయి విరిగినట్లు వంకరగా ఉంది. ఆచూకీ తెలిసిన వారు 9346010582, 9346917082 నంబర్లకు సమాచారం అందించాలని సీఐ కోరారు.

మహిళపై దాడి



గాయపడిన అనురాధ

తాడిపత్రిటౌన్: పాత కక్షల కారణంగా ఆదివారం మహిళపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన చోటు చేసుకుంది. పట్టణంలోని గాజులపాలెంకు చెందిన అనురాధకు ఇంటి పక్కనే ఉన్న క్రిష్ణ కుటుంబంతో ఇంటి సరిహద్దు విషయమై గత మూడేళ్లుగా పాత గొడవలున్నాయి. ఆదివారంఅనంతపురం వెళ్లేందుకు ఆమె ఇంటి నుంచి బయటకు రాగానే అక్కడే క్రిష్ణ బూతులతో రెచ్చిపోయాడు. అదే వీధిలో గాజుల వ్యాపారి వద్ద వున్న గాజుల దస్తంతో మోదడంతో తలకు తీవ్ర గాయమై రక్తం స్రావమైంది. ఆమె ఆసుపత్రిలో చికిత్సలు చేయించుకున్న అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

టీచర్ పోస్టుకు ఎంపిక

గుత్తి: ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో గుత్తికి చెందిన మహమ్మద్ అనీస్ సత్తా చాటాడు. 83 మార్కులు సాధించి 127వ ర్యాంకు కైవసం చేసుకుని టీచర్ పోస్టుకు ఎంపికయ్యాడు. అనీస్ టీచర్ పోస్టుకు ఎంపిక కావడంతో స్నేహితులు, సన్నిహితులు అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

ట్రాక్టర్ ఢీ కొని ఇద్దరికి గాయాలు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీ కొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు.. చాకలి రామాంజనేయులు, ఆదెప్ప చిన్నవడుగూరు వైపు నుంచి ద్విచక్ర వాహనంలో మండల కేంద్రానికి వస్తుండగా వ్యవసాయ పనులు ముగించుకొని చిన్నవడుగూరుకు వెళ్తున్న ట్రాక్టర్ ఢీ కొంది. ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ ఢీ కొని వృద్ధుడికి గాయాలు



గాయపడిన రామిరెడ్డి

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణంలోని నంద్యాల రోడ్డు సమీపంలో ఉన్న సాయిబాబా ఆలయం వద్ద ఆదివారం లారీ ఢీ కొని వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. తాడిపత్రి పట్టణంలోని బంకమట్టి వీధికి చెందిన రామిరెడ్డి సాయిబాబా ఆలయానికి వచ్చి నంద్యాల రోడ్డు వైపు వెళ్తున్న సమయంలో లారీ ఢీ కొనింది. ఘటనలో అతడి చేయి, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించగా.. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. ఘటనపై బాధితుడి కుటుంభ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల అరెస్టు



గుత్తి పోలీసు స్టేషన్‌లో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు



పామిడిలోని హైవేలో ఎన్టీఆర్ అభిమానుల ఆందోళన

గుత్తి/పెద్దవడుగూరు/పామిడి: గుత్తి పోలీసులు ఆదివారం పది మంది జూనియర్ ఎన్టీఆర్ అభిమానులను అరెస్టు చేశారు. జూనియర్ ఎన్టీఆర్‌పై అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై సారీ చెప్పాలని డిమాండ్ చేస్తూ అభిమానులు ఎమ్మెల్యే ఇల్లు, ఆఫీస్ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి పెద్ద ఎత్తున జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు అనంతపురం తరలి వెళుతుండగా మార్గమధ్యంలో పోలీసులు అడ్డుకున్నారు. జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు భరత్, అభిషేక్, అరుణ్, జేమ్స్ ఇశ్రాయెల్, సోహిల్, జాన్, హరీష్, వెంకటేష్, చరణ్ తదితరులను అరెస్టు చేసి గుత్తి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అలాగే ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటప్రసాద్ ఇంటి ముట్టడికి వెళ్తున్న 53 మంది జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్‌ను అరెస్ట్ చేసినట్లు పామిడి సీఐ యుగంధర్, పెద్దవడుగూరు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. కర్నూలు నుంచి అనంతపురం కు వెళ్తున్న వారిని పామిడి వద్ద అరెస్ట్ చేసి పెద్దవడుగూరు స్టేషన్‌కు తీసుకవచ్చామన్నారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి సొంత పూచికత్తుపై విడుదల చేశామన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదని అన్నారు.

స్కేటింగ్‌లో చిన్నారుల ప్రతిభ



మెడల్స్ సాధించిన విద్యార్థులతో కోచ్



ప్రతిభ కనబరిచిన సోనాక్షితో తల్లిదండ్రులు

తాడిపత్రిటౌన్: రాష్ట్రస్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో తాడిపత్రి చిన్నారులు ప్రతిభ కనబరిచారు. కాకినాడలో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకూ నిర్వహించిన రాష్ట్రస్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో తాడిపత్రి కి చెందిన బిల్విక్‌రెడ్డి మొదటిస్థానం, ముక్తేశ్వరి ద్వితీయస్థానం సాధించారని కోచ్ సాంబశివ తెలిపారు. బిల్విక్‌రెడ్డి (8 సంవత్సరాలు) రింక్-4, 5లో సిల్వర్ మెడల్ సాధించగా.. ముక్తేశ్వరి (10 సంవత్సరాలు) క్యాడెట్ రోడ్డు విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించింది. అలాగే రింక్-6లో బ్రాంజ్, రింక్-5లో సిల్వర్ మెడల్ సాధించినట్లు కోచ్ తెలిపారు.

బుక్కరాయసముద్రం: బీకేఎస్ మండల కేంద్రానికి చెందిన ఓ చిన్నారి స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. వివరాలు.. మండల కేంద్రంలోని వేణుగోపాల్, మౌనిక కుమార్తె సోనాక్షి (5) నగరంలోని రోటరీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో యూకేజీ చదువుతోంది. ఈ నెల 21 నుంచి 24 వరకూ కాకినాడలోని డాక్టర్ వైఎస్సార్ స్కేటింగ్ అకాడమీ క్రీడా మైదానంలో ఏపీ రెండో ఓపెన్ స్పీడ్ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో సోనాక్షి రెండు బ్రాంజ్ మెడల్స్ కైవసం చేసుకుంది. ప్రతిభ కనబరిచిన చిన్నారిని కోచ్ నాగేంద్ర, తల్లిదండ్రులు అభినందించారు.

శ్మశాన వాటికలో చెత్త డంప్ నివారించండి



క్రైస్తవ కొత్త శ్మశాన వాటికలో చెత్తా చెదారాన్ని డంప్ చేస్తున్న పంచాయతీ వాహనం



శ్మశాన వాటికలో డంప్ చేసిన చెత్తాచెదారం

పామిడి: పట్టణంలోని సర్వే నెంబర్ 1,310లోని క్రైస్తవ కొత్త శ్మశానవాటికలో పంచాయతీ చెత్తాచెదారం డంప్‌ను నివారించాలని క్రైస్తవులు ఆదివారం కోరారు. చెత్తాచెదారం డంప్ చేయడం వల్ల దుర్వాసతో పాటు మృతదేహాలను పూడ్చడం ఇబ్బందికరంగా మారిందన్నారు. క్రైస్తవ సంప్రదాయ భూస్థాపితం నిమిత్తం ఈ శ్మశాన వాటికను ప్రభుత్వం కేటాయించిందన్నారు. శ్మశాన వాటిక మొత్తం చెత్తాచెదారంతో కూడి డంప్‌మయమైందన్నారు. క్రైస్తవ శ్మశాన వాటికలో డంప్ చేయరాదంటూ పంచాయతీ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకపోయిందన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి శ్మశాన వాటిక స్థలంలో డంప్ చేయకుండా చర్యలు చేపట్టి సమస్య పరిష్కరించాలని వారు కోరారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

గుత్తి రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పుణ్యవతి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఫిర్యాదుల కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు. అధికారులు గైర్హాజరైతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. అలాగే ఫిర్యాదు పత్రాల్లో ప్రజలు తప్పకుండా ఆధార్, సెల్‌ఫోన్ నంబర్లను నమోదు చేయాలని ఆమె తెలిపారు. సమస్యలను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆటో, బైక్ ఢీ .. యువకుడికి గాయాలు

పెద్దపప్పూరు: మండలంలోని చింతరపల్లి వద్ద ఆదివారం ఆటో బైక్ ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా.. కొట్టాలపల్లికి చెందిన నవీన్ తాడిపత్రిలోని స్టీల్‌ప్లాంట్‌లో పనిచేయడానికి బైక్‌లో వెళ్తుండగా చింతరపల్లి మలుపు వద్ద తాడిపత్రి వైపు నుంచి వస్తున్న ఆటోను ఢీ కొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన యువకుడిని బంధువులు అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

నేడు రెడ్డిపల్లిలో 'రీకాలింగ్'

బుక్కరాయసముద్రం: మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీలో ఉన్న రేకులకుంట, అమ్మవారిపేట, రెడ్డిపల్లి, దయ్యాలకుంటపల్లి, వెంకటాపురం గ్రామాల్లో సోమవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త శైలజానాథ్ ఆదేశాల మేరకు రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలనిన్నారు.

పింఛన్ల తొలగింపుపై నేడు నిరసన

గార్లదిన్నె: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ ఆదేశాల మేరకు సోమవారం పింఛన్లు తొలగింపుపై నిరసన తెలపనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ ఎల్లారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అర్హులకు అన్యాయంగా పింఛన్లు తొలగించిందన్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారులకు వినతి పత్రం అందజేయడంతోపాటు నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు.

శ్రీశైల జగద్గురు మఠంలో ప్రత్యేక పూజలు



మఠంలో పూజలు చేస్తున్న శ్రీశైలం పీఠాధిపతి

గుంతకల్లుటౌన్: పాత గుంతకల్లులోని శ్రీశైల జగద్గురు మఠంలో ఆదివారం జగద్గురు నాగలూటి శివాచార్య మహాస్వాముల వారి 85వ మహాగణారాధన సందర్భంగా లింగధారణ, రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. శ్రీశైలం పీఠాధిపతి డాక్టర్ చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి ఆధ్వర్యంలో పూజలుచేశారు. ఈ సందర్భంగా భక్తులు పీఠాధిపతి ఆశీర్వాదం పొందారు. మహాగణారాధన పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కుమార పండిరాధ్యస్వామితో పాటు మఠం అభివృద్ధి మండలి సభ్యులు పాల్గొన్నారు.

కోటంకలో..

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకార్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థినికి ఆర్థికసాయం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని వివేకానంద పాఠశాలలో ఆదివారం ఉద్యోగ ఉపాధ్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో గుంతకల్లు మండలం తిమ్మాపురానికి చెందిన బిందుకు రూ.25 వేలు ఆర్థికసాయం అందజేశారు. బిందు తాడిపత్రిలోని టెక్ ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లమో చదువుతోంది. తండ్రి ఈ మధ్య కాలంలోనే మృతి చెందడంతో హాస్టల్ ఫీజు, పుస్తకాల కొనుగోలు కోసం ఎంఈఓ-2 రామగోవిందు ఆమెకు ఆర్థిక సాయం అందజేశారు. సేవాసంస్థ అధ్యక్షుడు రామాంజనేయులు, గురప్ప, రామేశ్వర్‌రెడ్డి, శ్రీహరి, నారబోయిన శంకర్, శ్రీరంగయ్య, కుమారస్వామి, శ్రీనివాసులు, నాగభూషనరావు, చంద్రమోహన్ పాల్గొన్నారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

గుత్తి రూరల్: మండలంలోని అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన రైతు భోగేశ్వరరెడ్డిని ఆదివారం పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వివరాలిలా ఉన్నాయి.. పొలంలో ఆయన గడ్డిని తొలగిస్తుండగా పాము కాటువేసింది. స్థానికుల సాయంతో ఆయన పామును చంపివేశాడు. అనంతరం కుటుంబసభ్యులు రైతును గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చిన్నారిని గాయపరిచిన శునకం



గాయపడిన సోనాక్షి

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని ఎస్సీ కాలనీలో ఆదివారం మూడేళ్ల చిన్నారి సోనాక్షిపై కుక్క దాడి చేసి కరిచింది. వివరాలు.. దుర్గా ప్రసాద్, రెహానా దంపతుల కుమార్తె సోనాక్షి తన స్నేహితులతో కలిసి ఇంటి బయట ఆడుకుంటుండగా కుక్క దాడి చేసింది. గాయపడిన చిన్నారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇటీవల కుక్కల బెడద అధికమైందని, మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని ప్రజలు కోరారు.